# వంటావిడ - ఇంటావిడ

విశాఖపట్టణం ట్రాన్స్‌ఫరంటే 'చచ్చావు పో' అన్నారు మిత్రులంతాను. "అక్కడ వంటమనిషి దొరకదు, మీ ఇద్దర్లో ఎవరో ఒకరు ఉద్యోగం మానేయాల్సిందే" అన్నారొకరు.

చాలా ఏళ్లు తప్పించుకున్నాం. మద్రాసునుంచి ట్రాన్స్‌ఫర్లు, ఆవిడకి ట్రాన్స్‌ఫరైనప్పుడు "మా ఆయనకీ వూళ్లో వుద్యోగం, పిల్లలు చదువుకుంటున్నారు" అనీ; నాకు ట్రాన్స్‌ఫరైనప్పుడు "మా ఆవిడకీ వూళ్ళో పని, పిల్లలు చదువుకుంటున్నారు" అని విన్నపాలు చేసుకొని నిమిషాలమీద ఆపించుకుంటున్నాం ట్రాన్సుఫర్లు.

మా బాసూ, వాళ్ళ బాసూ ఎక్కడో పార్టీలో కలిసి మా గురించి మాట్లాడుకున్నారట. "ఎప్పుడు ట్రాన్స్‌ఫర్ చేసినా వెళ్ళడు అతనేనా?" అంటే, "ఎప్పుడు ట్రాన్స్‌ఫర్ చేసినా కదలదు ఆవిడే!" అంటూనూ. ఫలితంగా ఇద్దరికి ఒకే రోజున వచ్చాయి ఆర్డర్లు.

"ధనంలాంటి మనిషి మరి దొరకదు" అనుకుంటూనే బయల్దేరాం. పాపం, ధనం అంత మంచిది.

ఉదయం ఏడు కాకముందే నేను, ఎనిమిదిన్నరకి కమలా ఇల్లు బయల్దేరి వెళ్ళిపోయినా, పిల్లలు ముగ్గురికీ అన్నాలుపెట్టి బళ్ళకి పంపి, సిటీబస్సులో కారియర్లు తెచ్చి మా యిద్దరికీ విడివిడిగా అందించి మళ్ళీ అవి పట్టుకుపోయి ఆరున్నరలోగా సాయంకాలం వంట పూర్తిచేసి మరీ ఇంటికి పోయేది.

వాసుదేవరావు రాసిన ఉత్తరం పుణ్యమాని నేను జాయినైన రోజునే ఆఫీసు కొచ్చింది ఒకావిడ, "అయ్యా, వంటమనిషి కావాలన్నారట" అంటూనూ.

ధనాన్ని మరిపించింది రాజేశ్వరి! (అదే ఆవిడ పేరు....) ఎందుకంటే ధనం రాత్రి ఇంటికి వెళ్ళిపోయేది. ఈవిడ నాలుగేళ్ళ కొడుకుతో సహా మా ముందు వసారాలో పడుకునేది.

పదిహేను రోజులు దాటేక ఒకనాడు సాయంకాలం నే నింటి కొచ్చేసరికి మా కమల వంటచేస్తూ కనిపించింది. "రాజేశ్వరి లేదా?" అన్నాను.

"లేదు."

"సినిమాకి పంపావు గావును."

"సినిమాక్కాదు, ఇంటికే పంపేశాను!"

"ఆవిడగారికి మనింట్లో వున్న నవలలు పత్రికలు చాలడంలేదట. మానేస్తానని వారంనుంచీ అంటోంది. ఇవాళ అదేదో స్వంత గ్రంథా లయ ప్రణాళికట- చూపించి ఇందులో చేరుతారా లేక అలా చేరే వాళ్ళింట్లో నన్ను చేరమంటారా అని తగువేసుకుంది. దానితో ఆవిడ అదెక్కడో చేరింది, నేనిక్కడ చేరాను."

మళ్ళీ మార్కెట్ సర్వేచేసి కామేశ్వరి అని ఇంకో ఆవిడని తెచ్చాం మనోహరరావు సాయంతో. ఈవిడ రాజేశ్వరిని మరిపించింది. ఇంట్లో తప్ప వసారాలో నిద్ర రాదంటూనూ, పనేమో ఇంతా అంతా శుభ్రంకాదు, నిప్పు అయినా సరే కడిగివేసేది బాయిలర్‌లో. పనిమనిషి గిన్నెలు సరిగా కడగడం లేదని ఆ పని కూడా తనకే యిమ్మంది.

నెల తిరిగేసరికి ఓ సాయంత్రం మా ఆవిడ వీధి గుమ్మంలో దిగాలుపడి కూచుని వుంది.

"అదేం?"

"కామేశ్వరి మానేసింది."

"నే చెప్పానా, వంటావిడతో తగూ పెట్టుకోవద్దని! విన్నావు కాదు" అని సాధించాను. అంతకంటె ఏం సాధించలేకపోయాను.

గట్టిగా ముప్ఫయేళ్ళులేని పూర్వ సువాసిని, కామేశ్వరి, అంటూ సెంటూ మడీ తడీ ఆచారం వీటిమీద కోడ్లు మాన్యువల్స్ తయారు

చెయ్యగల దిట్ట. మా ఆవిడ నెలవారీ సెలవులో ఆవిడకి దొరికి పోయింది. ఉదయం 'టిఫిన్ ప్లేటు కడిగి బోర్లించండి' అని మొదలు పెట్టి, ఓ గంట పోయాక కమలని హాల్లోంచి వీధి వసారాలోకి తరిమేసి చాపా, చెంబూ మొహాన కొట్టిందిట. "మాకు ఇంట్లో కలిపేసుకోవడమే ఆచారం" అని నెత్తి మొత్తుకొందట మా ఆవిడ. "ఇలాంటి అప్రాచ్యపు కుటుంబం అనుకోలేదు. పైగా కాన్వెంట్లలో చదివే పిల్లలూ!" అంటూ సంచీ పుచ్చుకు చక్కాపోయిందట!

అన్ని వివరాలు చెప్పి "ఇవాళ నా మూడ్ బాగాలేదు. మీరే వండండి. ఈ మూడు రోజులూ ఇద్దరం ఆఫీసులకి సెలవులు పెట్టేద్దాం" అంది కమల.

ఈమారు కొంచెం జాగ్రత్తగా వుందాం అని నిశ్చయించుకున్నాం; జగదీశ్వరిని ఎపాయింట్ చేసినపుడు.

జగదీశ్వరి పాతికేళ్ళ యువతి భర్త మద్రాసులో ఏదో సినిమా కంపెనీలో పని చేస్తున్నాట్ట. మేం మద్రాసులో వుండే ఇంటి అడ్రసు అడిగి ఆ పక్కింట్లోనే వుండేవాళ్ళం- అంటూ చెప్పింది. ఇరుగూ పొరుగులా ఆత్మీయులమైపోయాం. "నువ్వు మద్రాసునుంచి ఎందుకు వచ్చేశావు ?" అడిగాను. "రెండేళ్ళయిందండి. ఆయనే వదిలేశాడు, నా అందంచూసి సినిమావాళ్లు నన్ను స్టార్ని చేస్తారని ఆయన భయం" అంది.

నిజమే. అంత అందగత్తె, జగదీశ్వరి. అంతకంటె 'పనివతి' కూడాను. ఇల్లు వూడ్చడం, గుడ్డలు ఉతకడం, పక్కలు వెయ్యడం, ఫ్లవర్‌వాజులూ, కర్టెన్లు సరిచూడడం తనకి రాని పనిలేదు. పిల్లల్ని ముస్తాబుచేసి కాన్వెంట్‌కు పంపుతూ, వాళ్ళని కౌగలించుకుని ముద్దులు పెట్టుకునేది. పొడరుమీద తడి వచ్చిందని వాళ్లు గోలపెడితే మళ్ళీ మెత్తేది. ఆ దృశ్యంచూసి నేను పరవశించి పోతూవుంటే "ఏం, మీ వాచీ ఆగిపోయిందా ?" అని కూకలేసింది కమల. ఓసారి మా చెడ్డ చిరాకేసింది చెప్పొద్దూ!

జగదీశ్వరి చేరిన యిరవై రోజులనాటి సాయంకాలం నేను యింటి కెళ్ళేసరికి పెద్ద గొంతుతో 'ఒకసారి చెబితే తెలుసుకోవాలి!' అనే మాట, వెంటనే టిఫిన్ ప్లేటు విసిరేసిన ధ్వని వినబడ్డాయి. తలుపు తీసే వున్నా కాలింగ్‌బెల్ నొక్కాను. ఆ వాతావరణం మారాలని ఆశతో.

"ఆవిడ మానేస్తుందట." అంది కమల ఏడుపు మొహంతో టిఫినూ, కాఫీ తెచ్చిచ్చి. "సర్దుకోవాలి కమలా! మళ్ళీంత మంచి మనిషి దొరకదు, చూసుకో" అన్నాను అనునయంగా. "ఇంతకీ ఎందుకు మానేస్తుందిట?"

"నా వంట నచ్చలేదుట, ఆవిడకి."

"నువ్వు- వండుతున్నావా?"

"మరేం చెయ్యను? మన కుక్కరు ఇంపోర్టెడ్ కాదుట. మన గ్రైండరు మంచి కంపెనీది కాదుట. మనం వాడే సబ్బులు చవకరకాని విట. ఏం చెయ్యను? మరి."

నేను టిఫిన్ తినే సాకుతో మౌనంగా వున్నాను.

"మిమ్మల్నీ, పిల్లల్నీ చూసి ముచ్చటపడి వుందిట. నా మొహం చూస్తే ఎప్పుడో పారిపోవాలనిపించిందిట" అని చీర చెంగుతో మొహం కాబోలు ఒత్తుకుంది.

నాలో ఆశ చిగిర్చింది.

"చివరికి ఎంత మాట అన్నదో తెలుసా? ఈ ఇంట్లో నేనైనా వుండాలి, మీరైనా వుండాలి అన్నదండీ" అంది కమల, కళ్ళే ఒత్తుకుంటూ.

"పాపం! తను ఎక్కడికి పోతుంది, ఈ పరువంపు వయసులో? నీకైతే ఉద్యోగం వుంది. వైవాహిక జీవితం పన్నెండేళ్ళు గడిపావు. పిల్లల్ని కన్నావు........ పోనీ మనం ఓసారి లాయర్ పట్టాభిగారిని చూద్దామా ఈ విషయంలో," అన్నాను....

(23-12-78)

[Art Buchwald కథ వొకటి చూసి]